# యాప్ ట్రబుల్..!

- నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- గత నెల 31తో ముగిసిన గడువు
- జిల్లాలో 53.51శాతమే నమోదు
- చాలా చోట్ల కనిపించని ప్రజాపాలన వివరాలు

జయశంకర్ భూపాలపల్లి. జనవరి 2 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇళ్ల సర్వే నత్తనడకన కొనసాగుతుంది. యాప్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలతో సిబ్బంది సతమతమవుతున్నారు. యాప్ ఓపెన్ కాకపోవడం, ఓపెన్ అయినా నమోదు జాప్యం కావడంతో ఒక్కో ఇంటి సర్వే అరగంటకు పైగా పడుతుందని సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో సర్వే రోజుల తరబడి కొనసాగుతున్నది. కాగా, ప్రభుత్వం డిసెంబర్ 31తో సర్వే పూర్తి చేయాలని ఆదేశించినా ఇప్పటి వరకు సగం సైతం పూర్తి కాలేదు. ప్రభుత్వం ఇచ్చిన గడువు పూర్తయినా జిల్లాలో కేవలం 53.51 శాతం సర్వే మాత్రమే జరిగింది. యాప్‌లో తమ ప్రజాపాలన దరఖాస్తు వివరాలు కనిపించడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయకపోవడం వల్లే తమ డేటా కనిపించడం లేదని వాపోతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే అయినా పారదర్శకంగా జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజులైనా సర్వే పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కాటారంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్న సిబ్బంది

### యాప్‌లో సాంకేతిక సమస్యలు

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సాంకేతిక సమస్యలు సిబ్బందిని, ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్నాయి. లాగిన్ రాకపోవడంతో గంటల తరబడి సిబ్బంది, ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. లాగిన్ వచ్చినా వివరాల నమోదు ఆలస్యమవుతుందని పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, ఉపాధిహామీ ఉద్యోగులు, సిబ్బంది, మున్సిపాలిటీ పరిధిలో బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యాలయ ఉద్యోగులను పూర్తి స్థాయిలో సర్వేలో ఉపయోగించుకుంటున్నారు. గ్రామాలు, పట్టణంలో కార్యాలయాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బందిని వినియోగించుకున్నప్పటికీ యాప్‌లో సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి. యాప్‌లో సర్వే చేసిన వారి వివరాలు పలు చోట్ల చేయనట్లు చూపిస్తున్నాయని, ఒక్కో దరఖాస్తుకు అరగంటకు పైగా సమయం పడుతుందని ఉద్యోగులు చెప్పున్నారు. జిల్లాలోని 11 మండలాలు, భూపాలపల్లి మున్సిపాలిటీలో గత నెల 10న ప్రారంభమైన సర్వే డిసెంబర్ 31తో ముగియగా ఇప్పటి వరకు 53.51 శాతం మాత్రమే నమోదైంది.

### 66,063 దరఖాస్తుల నమోదు

జిల్లాలో 66,063 దరఖాస్తులను ఉద్యోగులు ఇప్పటి వరకు సర్వే చేశారు. మొత్తం 1,23,461 దరఖాస్తులు రాగా, గత నెలాఖరు వరకు 66,063 దరఖాస్తులను సర్వే చేసి యాప్‌లో నమోదు చేశారు. కాటారం, రేగొండ, టేకుమట్లలో 60 శాతం సర్వే పూర్తయింది. భూపాలపల్లి మండలంలో 6,859 (58.95 శాతం), మున్సిపాలిటీ పరిధిలో 4,024 (45.11 శాతం), చిట్యాల మండలంలో 6,093 (55.34 శాతం), గణపురం మండలంలో 4,958(43.89 శాతం) , కాటారం మండలంలో 7,377 (60.27 శాతం), మహదేవపూర్ మండలంలో 5,501 (53.06 శాతం), మల్హర్ మండలంలో 3,406 (38.11 శాతం), మొగుళ్లపల్లి మండలంలో 5,759 (52.75 శాతం), మహాముత్తారం మండలంలో 4,248 (46.90 శాతం), పలిమెల మండలంలో 1,744 (69.65 శాతం), రేగొండ మండలంలో 11,313 (60.75 శాతం), టేకుమట్ల మండలంలో 4,781 (60.14 శాతం) దరఖాస్తులను యాప్‌లో నమోదు చేశారు.

## విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం

గణపురం, జనవరి 2 : గ్రామీణ విద్యార్థులకు విద్యాభివృద్ధిలో తోడ్పాటు అందించే దిశగా కృషి చేయడం అభినందనీయమని హెచ్ఎం దేసు సతీశ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన ఇరుకుళ్ల రమణయ్య కుమారులు మునీందర్, ముక్తేశ్వర్, మురళీకృష్ణ గురువారం మండలకేంద్రంలోని పాఠశాలకు రూ.25 వేలతో సైన్స్ ల్యాబ్ పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పుట్టిన గడ్డపై మమకారంతో రమణయ్య కుమారులు పాఠశాలకు విలువైన సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇరుకుళ్ల లక్ష్మి, ఉపాధ్యాయులు భరత్‌కుమార్, కుమారస్వామి, షకీరాబేగం, రాంబాబు, రమేశ్, శ్రీనివాస్, దేవేందర్, సదానందం, ముస్తాఖ్, హేమలత, పీడీ సరిత ఉన్నారు.



మావోయిస్టుల కుటుంబ సభ్యులతో ఎస్పీ శబరీష్

## లొంగుబాటుకు కృషి చేయాలి

**మావోయిస్టు కుటుంబ సభ్యులకు ములుగు ఎస్పీ శబరీష్ సూచన**

ములుగు, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు వారి కుటుంబ సభ్యులు కృషి చేయాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ అన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో గురువారం మావోయిస్టు రాష్ట్ర కమిటీ హోదాకు చెందిన వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న, తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్, గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్, జిల్లా కమిటీ హోదాలో ఉన్న కన్నాయిగూడెం మండలం తుపాలగూడెం గ్రామానికి చెందిన పులసం పద్మ అలియాస్ గంగక్క, ఏటూరునాగారం మండలం గోగుపల్లి గ్రామానికి చెందిన ఈసం అర్జున్ అలియాస్ రఘుపతి, పార్టీ సభ్యుడైన ఏటూరునాగారం మండలానికి చెందిన సదనపల్లి చందు కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడారు. పోలీసుల ఎదుట లొంగిపోవడం ద్వారా ప్రభుత్వం నుంచి వారిపై ఉన్న రివార్డు నగదును ఇవ్వనున్నట్లు చెప్పారు. దీంతో పాటు పునరావాస పథకం కింద అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎస్పీ మావోయిస్టుల కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ ఉన్నారు.

## కొత్తగూడెం అవాస గ్రామాన్ని జీపీగా గుర్తించాలి

ఏటూరునాగారం, జనవరి 2 : మండలంలోని కొండాయి పంచాయతీ పరిధి దొడ్ల కొత్తూరు సమీపంలోని కొత్తగూడెం గ్రామాన్ని పంచాయతీగా గుర్తించాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు తిప్పనపల్లి రవీందర్, గ్రామ పెద్దలు పాయం వెంకటయ్య, తుడుందెబ్బ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాపారావు, పాయం సురేశ్, నాయకులు, గ్రామ పెద్దలు మందపల్లి సత్యం, రాజు, మాదిరి వేణు, వావిలాల శ్రీను కోరారు. కొండాయి గ్రామం వరద ముంపునకు గురవుతున్నందున కొత్తగూడెం గ్రామంగా ఏర్పాటు చేసుకుని కొంత మంది ఇక్కడ నివాసం ఉంటున్నారని వారు తెలిపారు. మంత్రి సీతక్క, అధికారులు స్పందించి కొత్తగూడెంను గ్రామ పంచాయతీగా ప్రకటించాలని కోరారు.

## అధికారులను కలిసిన టీఎన్‌జీవోలు

ములుగురూరల్, జనవరి 2 : నూతన సంవత్సరం సందర్భంగా టీఎన్‌జీవో నాయకులు గురువారం కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, అడిషనల్ కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీఎన్‌జీవో కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పోలు రాజు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చైతన్య, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు రమాదేవి, సునిత, యుగేందర్‌రెడ్డి, శ్రీవాణి, విజయ, సరిత, రాంగోపాల్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్, వరుణ్, ఈశ్వర్, భాస్కర్, మేఘన, ప్రత్యూష, స్నేహ ఉన్నారు.

## గురుకులాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, జనవరి 2 : సంక్షేమశాఖ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ములుగు డీసీవో ఏ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థులు ఇంగ్లిష్ మీడియం ప్రవేశాలకు ప్రభుత్వం ప్రవేశపరీక్ష నిర్వహిస్తుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఫిబ్రవరి 1వ తేదీలోగా తగిన ధృవపత్రాలతో https://tgcet.ccg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

చిట్యాల, జనవరి 2 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆదేశాలతో గురువారం సైబర్ నేరాలపై హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ , మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ రమేశ్, కానిస్టేబుళ్లు లాల్ సింగ్, లింగన్న, సందీప్, నాగరాజు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను అమలు చేయాల్సిందే..

మహదేవపూర్, జనవరి 2 : ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిందేనని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్షల డప్పులు.. వేల గొంతుల మహా ప్రదర్శన'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలాధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్, సీనియర్ నాయకులు నల్లభాగ ధరయ్య, తూడిచర్ల దుర్గయ్య పాల్గొన్నారు.

## దళితబంధు నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలి

మంగపేట, జనవరి 2 : దళితబంధు నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 6న ములుగు జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న దళితబంధు లబ్ధిదారుల ఆత్మగౌరవ సభ పోస్టర్లను ఆయన గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. దళితుల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే కేబినెట్ మీటింగ్‌లో దళిత బంధు నిధులు విడుదలకు సానుకూల ప్రకటన చేసి, అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించాలని కోరారు. రెండో విడుత ఎంపికైన లబ్ధిదారులకు వివిధ జిల్లాల కలెక్టర్ల అకౌంట్లో ఉన్న డబ్బులు వేయమని ఏడాది కాలంగా ఎన్ని నిరసనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ విషయంలో మంత్రి సీతక్క స్పందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారు దర్శనాల సంజీవ, మండల అధ్యక్షుడు బియ్యం శ్రీను, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్యాంబాబు, డివిజన్ ఇన్‌చార్జి కాళ్ల రామకృష్ణ, ఎనగందుల మొగిలి, జయరాజు, దేవేందర్, కిశోర్, రాము, కూకట్ల శ్రీను, సారయ్య, మంచాల నాగేంద్ర, బాబు, పూసల నర్సింహారావు, మోదుగు బాబు, కేశవులు, బీస సాంబయ్య, సతీశ్, ఏకాంతం పాల్గొన్నారు.

## మూడు మోటర్లతో దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, జనవరి 2 : దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని మోటర్లను గురువారం పునః ప్రారంభించారు. ముందుగా ఫేస్–3లోని ఒక మోటర్ ఆన్ చేసి, తర్వాత ఫేస్ 2, 3లోని ఒక్కో మోటర్ ఆన్ చేసినట్లు నీటిపారుదశాఖ అధికారులు తెలిపారు. మూడు మోటర్ల ద్వారా రోజుకు 831 క్యూసెక్కుల గోదావరి నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు డీఈ శరత్, ఏఈఈ సాయిరాం చెప్పారు.

## మంత్రి సీతక్కను కలిసిన కలెక్టర్ దివాకర



సీతక్కకు మొక్క ఇస్తున్న కలెక్టర్

ములుగురూరల్, జనవరి 2 : ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కను గురువారం కలెక్టర్ టీఎస్ దివాకర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించి మొక్క అందజేశారు.

## విద్యార్థుల ఫొటోలతో క్యాలెండర్ ఆవిష్కరణ

మహాముత్తారం, జనవరి 2 : మండలంలోని కొర్లకుంట పాఠశాల విద్యార్థుల ఫొటోలతో కూడిన క్యాలెండర్‌ను హెచ్ఎం శిరీష అధ్యక్షతన గురువారం ఎంఈవో పాశం సంజీవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కూడా సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కామెడీ సతీశ్ రెడ్డి, కుసుమ కృష్ణమోహన్, సుష్మ, రాధిక, సతీశ్‌కుమార్ సమ్మయ్య, మౌనిక, తల్లిదండ్రులు రాజు, ఉమ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో సంజీవరెడ్డి











